క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

వరికుంటపాడు: బ్రాహ్మణపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ కరీష్మా 29 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి చేయూత

ఆత్మకూరురూరల్: పట్టణంలోని 15వ వార్డుకు చెందిన దివ్యాంగురాలు కొమరగిరి రమణమ్మకు పట్టణానికి చెందిన డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జే ప్రణీత్‌చౌదరి శుక్రవారం నిత్యావసర సరుకులు, కూరగాయలు వితరణ చేశారు. ఐదేళ్లుగా ప్రతి నెలా చేయూతనందిస్తున్న ప్రణీత్‌కు రమణమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, తోడేటి అశోక్, ఆది యాదవ్ పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

సీతారామపురం: సింగారెడ్డిపల్లికి చెందిన సింగాల తిరుపతయ్యపై అదే గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ పెంచలప్రసాద్, సచివాలయ ఉద్యోగి గోరంట్ల శ్రీనివాసులు, నాగం నవీన్, నాగం ప్రవీణ్ పాతకక్షల నేపథ్యంలో దాడికి పాల్పడినట్లు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనూష తెలిపారు.

ఈఏపీ సెట్‌లో ఆదర్శ పాఠశాల విద్యార్థిని ప్రతిభ


ద్విజిత

సీతారామపురం: స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన ఇంటర్ (బైపీసీ) విద్యార్థిని కలివెల ద్విజిత ఈఏపీ సెట్‌లో 8,729వ ర్యాంకు సాధించినట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రెహమాన్ శుక్రవారం తెలిపారు. చదవాలనే సంకల్పం, పట్టుదల ఉంటే ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులు సైతం ర్యాంకులు సాధించవచ్చని ద్విజిత రుజువు చేసిందన్నారు. ఈ సందర్భంగా ద్విజితను ఎంఈఓ మస్తాన్‌వలితో పాటు కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.

లార్వా సర్వే

అనుమసముద్రంపేట: మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌పేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి మంజులమ్మ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ఏఎస్‌పేటలో వైద్యారోగ్య సిబ్బంది శుక్రవారం ఇంటింటిని సందర్శించి లార్వా సర్వే చేపట్టారు. దోమలతో వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, తదితర జ్వరాలపై అవగాహన కల్పించారు. దోమల నియంత్రణకు ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

డీటీకి ప్రశంసాపత్రం

సోమశిల: సార్వత్రిక ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించినందుకు గానూ మండల డిప్యూటీ తహసీల్దార్ గిరీష్‌కు ఆత్మకూరు ఆర్డీఓ మధులత శుక్రవారం ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు మండల రెవెన్యూ అధికారులు అభినందనలు తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

సోమశిల(చేజర్ల): చేజర్ల మండలం గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సురేఖ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డేను శుక్రవారం నిర్వహించారు. ప్రీస్కూల్ పూర్తి చేసుకున్న చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో చేర్పించారు. అంగన్‌వాడీలు పద్మ, విజయకుమారి, హెచ్‌ఎం వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జామాయిల్‌తోటలో గుర్తుతెలియని బైక్

మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులోని జామాయిల్ తోటలో గుర్తుతెలియని ఏపీ21 కే 5979 నంబర్ గల హీరో హోండా బైక్ నిలిపి ఉండడాన్ని స్థానికులు గుర్తించి శుక్రవారం పోలీసు లకు సమాచారం అందజేశారు. పోలీసులు బైక్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

12వ వార్డుకు ఉపఎన్నిక నిర్వహించాలని వినతి

ఆత్మకూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్ స్థానానికి ఉపఎన్నిక నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగరాజు కోరారు. ఈ మేరకు ఆత్మకూరు ఆర్డీఓ కురుబా మధులతను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 12వ వార్డు కౌన్సిలర్ కొండా యుగలక్ష్మి అనారోగ్యంతో 9 నెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉపఎన్నిక నిర్వహించకపోవడంతో ప్రజాసమస్యలు పరిష్కారమవక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన ఆర్డీఓ మాట్లాడుతూ ఎవరైనా కౌన్సిలర్ మృతి చెందితే ఆరు నెలలలోపు ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని, సార్వత్రిక ఎన్నికల కారణంగా ఉపఎన్నిక ఆలస్యమైందన్నారు. మున్సిపాలిటీకి సంబంధించిన వ్యవహారం కావడంతో మున్సిపల్ కమిషనర్‌ను కలవమని సూచించారు.

విద్యాసామగ్రి పంపిణీ

వరికుంటపాడు: మండలంలోని కనియంపాడు, తూర్పుబోయమడుగుల పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య,నోట్ పుస్తకాలు, యూనిఫామ్, తదితర సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం


జలదంకిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జలదంకి: ఆరోగ్యకర జీవనం, మానసిక ప్రశాంతత యోగాతోనే సాధ్యమని జలదంకి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కొండారెడ్డి పేర్కొన్నారు. జలదంకి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. జలదంకి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ హరిప్రసాద్ యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా ఏకాగ్రత పెరిగి విద్యార్థులు చదువుల్లో రాణిస్తారన్నారు. అనంతరం విద్యార్థులతో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. విద్యార్థులు మానసిక ప్రశాంతతో పాటు ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ కామేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినులతో యోగాసనాలు వేయించారు. యోగా సాధనతో కలిగే ప్రయోజనాలను వివరించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డీఈఓ గోపాల్, ప్రధానోపాధ్యాయిని అనంతలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. 20వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఒంటేరు మల్లికార్జున పాల్గొన్నారు. పట్టణంలోని త్రికోటేశ్వర కళ్యాణ మండపంలో బీజేపీ, టీడీపీ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, తుమ్మల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. అపస్ జిల్లా కార్యదర్శి పట్నం అనిల్‌కుమార్, బీజేపీ పట్టణాధ్యక్షుడు కరటంపాటి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కలిగిరి: యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయులు నందనవనం ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. కలిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. సిద్ధనకొండూరులో ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ రోహిణి ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీకాంతారావు, పాఠశాల కమిటీ చైర్మన్ అంబటి మాల్యాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడిని జయించొచ్చు

అల్లూరు : ప్రతిరోజూ యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడిని జయించవచ్చని యోగా గురువు మల్లికార్జున పేర్కొన్నారు. స్థానిక రామకృష్ణ కళాశాల మైదానంలో కేఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు మల్లికార్జున యోగాపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా శారీరక సౌష్టవం, మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతాయని తెలిపారు. అనంతరం యోగా గురువును ఘనంగా సత్కరించారు.

అనుమసముద్రంపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ మోడల్ పాఠశాలలో హెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వెలగపాటి వెంకటేశ్వర్లు విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. విద్యార్థుల మానసిక వికాసానికి యోగా ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉదయగిరి: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గడ్డంవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయమూర్తి అంజయ్య, ఉన్నత పాఠశాలలో ఎంఈఓ తోట శ్రీనివాసులు, డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ నరసింహులు యోగాపై అవగాహన కల్పించారు. యోగా సాధనతో మానసిక, శారీరక రుగ్మతల నుంచి దూరం కావచ్చన్నారు. ప్రతిఒక్కరూ యోగా సాధనను అలవాటు చేసుకోవాలన్నారు. రక్తప్రసరణతో పాటు నాడీ వ్యవస్థ బాగా పనిచేస్తుందన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సీతారామపురం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అనంతరం యోగా విశిష్టపై అవగాహన కల్పించారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలంటే యోగా ఉత్తమమైన సాధనమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు చిన్న వయస్సు నుంచే యోగా సాధన చేసేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు ఒక గంట యోగాకు కేటాయిస్తే ఎన్నో అనారోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. పాఠశాలల ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ధ్యాన కేంద్రాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో బీజేపీ మండలాధ్యక్షుడు దేగా మధు ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వింజమూరులోని ధ్యాన మందిరంలో యోగాపై అవగాహన కల్పించారు. చాకలికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీడీ కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన యోగా విన్యాసాలు అలరించాయి.

దుత్తలూరు: ప్రతి నిత్యం యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత పొందవచ్చని హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌కే ఖాజామొహిద్దీన్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాపంపల్లి పంచాయతీలో యోగాపై అవగాహన కల్పించారు. యోగా అనేది దేహానికి, మనస్సుకు సంబంధించిందని, మనిషి తనను తాను తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనసాని ఆదెమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ కిరణ్మయి, హెల్త్ అసిస్టెంట్ శ్రీహరి, ఏఎన్‌ఎం ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు. ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న, పీఈటీ రమేష్ పాల్గొన్నారు.


అల్లూరులో యోగా గురువుకు సత్కారం


వరికుంటపాడు: తిమ్మారెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో..


ఉదయగిరి: గడ్డంవారిపల్లి ఉన్నత పాఠశాలలో...


సీతారామపురం జెడ్పీ హైస్కూల్‌లో..


వింజమూరులోని యోగా కేంద్రంలో ..


సోమశిల: అనంతసాగరంలో..


ఏఎస్‌పేట: ఏపీ మోడల్ పాఠశాలలో...


ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాలలో..


ఆత్మకూరు: త్రికోటేశ్వర కళ్యాణ మండపంలో...


కలిగిరి: సిద్ధనకొండూరులో..


దుత్తలూరు మండలం పాపంపల్లిలో..

ముగిసిన సంతానలక్ష్మి ఉత్సవాలు


పొంగళ్లు పెట్టేందుకు ఊరేగింపుగా వెలుతున్న మహిళలు

ఉదయగిరి: పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలోని సంతానలక్ష్మి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు సంతానలక్ష్మిని ధనలక్ష్మిగా అలంకరించి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. మహిళలు నూతన బుట్టల్లో పొంగళ్ల సామగ్రితో పోలేరమ్మ చెట్టు వద్ద నుంచి మెయిన్‌బజారు మీదుగా బాణసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తమ వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ తిప్పారు.

నార్త్‌మోపూర్ పాఠశాలకు విద్యాప్రవేష్ బృందం


పాఠశాలను సందర్శించిన విద్యాప్రవేష్ బృందం

అల్లూరు : మండలంలోని నార్త్‌మోపూర్ ప్రాథమిక పాఠశాలను కేంద్ర ప్రభుత్వ విద్యాప్రవేష్ బృందం శుక్రవారం సందర్శించింది. న్యూఢిల్లీ నుంచి ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ జూబిలి పద్మనాభన్, సమగ్రశిక్ష నెల్లూరు అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జీ సుధీర్‌బాబు, పల్లిపాడు డైట్ కళాశాల అధ్యాపకుడు కే విజయచంద్ర పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పద్మనాభన్ మాట్లాడుతూ జాతీయ విద్య శిక్షణా పరిశోధన మండలి ఆరేళ్లు నిండి ఒకటో తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థుల కోసం 90 రోజుల విద్యా ప్రవేష్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోందని చెప్పారు. ఒకటో తరగతి పిల్లల్లో సహజంగా ఉండే నైపుణ్యాలను వివిధ రకాల కృత్యాలు, ఆటపాటల ద్వారా వెలికితీయడమే ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సునీత, హెచ్‌ఎం చెంచుసుబ్బయ్య, ఫీల్డ్ఇన్వెస్టిగేటర్ నాగరాజారావు, సీహెచ్ గోపాల్, వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలి


సీతారామపురం: మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌వలి

కలిగిరి: బడిఈడు పిల్లలు పాఠశాలలో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైన ఉందని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 13వ తేదీ వరకు బడి బయట పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓ సురేష్, ఏపీఓ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ వెలుగోటి మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: బడి బయటి పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ- 1,2 షేక్ నజీర్‌బాషా, చలపతి అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన నేను బడికి పోతా కార్యక్రమంపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా, సంక్షేమ సహాయకులు, సీఆర్పీలు హాస్టల్ వార్డెన్లు, ఉర్దూ టీచర్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కలిసికట్టుగా నేడు బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. 14 ఏళ్లలోపు వయస్సు కలిగిన పిల్లలు ఎవరైనా బడి బయట ఉంటే వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కాగా మురగళ్ల, అప్పారావుపాళెం, వందూరుగుంట, గొల్లపల్లి, బట్టేపాడు, వెన్నవాడ, పేరారెడ్డిపల్లి, తదితర పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకున్నారు.

నేను బడికి పోతానును విజయవంతం చేయాలి

జలదంకి: మండలంలో జూలై 12వ తేదీ వరకు చేపడుతున్న నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ-1 శ్రీధర్ కోరారు. జలదంకి ఉన్నత పాఠశాల ఆవరణలో నేను బడికి పోతా కార్యక్రమంపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో 367 మంది బడి బయట పిల్లలను గుర్తించామన్నారు. వారిలో ఇప్పటికే 260 మందిని పాఠశాలల్లో చేర్పించామన్నారు. మిగిలిన వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు, సీఆర్పీలు, అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాసు, ఎంపీడీఓ రామచంద్ర, ఎంఈఓ-2 నాగేశ్వరరావు, సీఆర్పీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సీతారామపురం: నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికార యంత్రాంగంతో నేను బడికి పోతా కార్యక్రమంపై శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జూలై 12వ తేదీ వరకు నిర్వహించే నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా 14 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రెహమాన్, ఇన్‌చార్జి సీడీపీఓ తేజస్విని, వార్డెన్ రమణారెడ్డి, హెచ్‌ఎంలు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



మర్రిపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏపీసీఆర్‌పీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు కే తిరుపాలు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్యసేవలపై వైద్యాధికారి గోపినాథ్‌ను ఆరాతీశారు. వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని, అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నామని డాక్టర్ తెలిపారు. స్పందించిన తిరుపాలు మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట ఆరోగ్య విస్తరణాధికారి కొండారెడ్డి, హెల్త్‌సూపర్‌వైజర్ జగన్‌మోహన్, మర్రిపాడు మండల ఏపీసీఆర్‌పీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తల రత్నయ్య ఉన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



మర్రిపాడు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. చుంచులూరు, కదిరినాయుడుపల్లి, టీఎన్‌పేట, బ్రాహ్మణపల్లి, కంపసముద్రం తదితర పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలుసుకుని సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఏపీటీఎఫ్ రాజీలేని పోరాటాలు సాగిస్తోందని తెలిపారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన జీఓ 117ను రద్దు చేసి 3, 4, 5 తరగతులను వెనుకకు పంపాలని డిమాండ్ చేశారు. ఆంగ్ల మాధ్యమాన్ని కొనసాగించాలని కోరారు. ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బీ వెంకటేశ్వరరాజు, సుబ్బారెడ్డి, శివయ్య, నాగరాజు, పెంచలయ్య, సంధానిబాషా, కరీంమొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు,

పోలేరమ్మకు విశేష పూజలు



సోమశిల: పాతదేవరాయపల్లిలో పోలేరమ్మకు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. పోలేరమ్మకు భక్తులు భక్తిశ్రద్ధలతో చద్ది సమర్పించారు.


టీడీపీ అరాచకాలను ప్రజలు హర్షించరు


టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన పాడిరైతు ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: అభివృద్ధి పనులు చేస్తారనే నమ్మకంతో ప్రజలు టీడీపీకి పట్టం కట్టారని, దాన్ని విస్మరించి అరాచకాలకు పాల్పడితే వారు హర్షించరని, ఈ విషయాన్ని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి గుర్తించాలని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హితవుపలికారు. పట్టణంలోని పుల్లారెడ్డి నగర్‌లో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన పాడి రైతు ఇంటి నిర్మాణాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో తుమ్మలపెంటరోడ్డు, దామవరం విమానాశ్రయం, కావలి కలుగోళమ్మ గుడి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి, సంగం బ్యారేజ్ వద్ద బైపాస్ కెనాల్, కావలిలో ట్రంక్‌రోడ్డు విస్తరణ, రామాయపట్నం పోర్టు, ఫిషింగ్ హార్బర్, తదితర నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికతో ముందుకుపోకుండా రౌడీయిజం, గూండాయిజం, ఆస్తులు ధ్వంసం చేయడం, కక్ష సాధింపులకు పాల్పడడం తగదన్నారు. ఎప్పుడూ అధికారం ఒకరి చేతిలోనే ఉండదని, అందువల్ల అటువంటి పనులు మానుకుని కావలి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన నివేశన స్థలంలోనే పాడి రైతు ఇంటిని నిర్మించుకుంటుంటే టీడీపీ నాయకులు జేసీబీతో దుర్మార్గంగా ధ్వంసం చేశారని తెలిపారు. తమ రెక్కల కష్టార్జితంతో ఇంటిని నిర్మించుకుంటున్నామని, ధ్వంసం చేయవద్దని పేద పాడిరైతు దంపతులు ఎంత వేడకున్నా కనికరించకుండా కూల్చేయడం బాధాకరమన్నారు. బోగోలు మండలంలో పాతికేళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూముల్లోని చేతికొచ్చిన పంటను ధ్వంసం చేస్తామని రైతులను భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలు టీడీపీకి ఓట్లు వేసి గెలిపించింది పేదలపై రౌడీయిజం చేస్తూ, వారి ఆస్తులను ధ్వంసం చేస్తూ, వారు కోలుకోలేని విధంగా ఆర్థికంగా చితికిపోయేలా చేయడానికా అని రామిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికారంలోకి వచ్చామనే అహంకారంతో టీడీపీ నాయకులు సాగిస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ఫలితం అనుభవించకతప్పదన్నారు. గతంలో కావలి నియోజకవర్గంలో 10, 15 అడుగుల రోడ్లతో లేఅవుట్లు ఉండేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 30 అడుగుల రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, తదితర మౌలిక వసతులతో లేఅవుట్లను ప్రోత్సహించామన్నారు. నుడా లేఅవుట్లు కూడా ఆ విధంగానే రూపుదిద్దుకున్నాయని తెలిపారు. పొలాలు లేఅవుట్లుగా మారినప్పుడు అందులో ఉండే పంట కాలువలు డ్రైనేజీలుగా మారి ఉంటాయన్నారు. లేఅవుట్లలో పంట కాలువలు ఉన్నాయని కక్ష పూరితంగా వాటిని నష్టపరుస్తామని చెప్పడం అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలను బాధ పెట్టడమేనన్నారు. ఎమ్మెల్యే దగుమాటి కూడా లేఅవుట్లు వేసి ఉన్నారని, ఆయనకు ఇవన్నీ తెలియనవి కాదన్నారు. కావలి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని, ఇక నుంచైనా అటువంటి వాటికి స్వస్తి పలికి కావలి నియోజకవర్గం ప్రశాంతంగా ఉండేలా చూడాలని కోరారు. మంచి పనులకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. ప్రజలకు మంచి చేస్తే మళ్లీ మళ్లీ ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తారని, అధికారం ఉందని అరాచకాలకు పాల్పడితే ప్రజలు ఏం చేయాలో అది చేస్తారన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

సీతారామపురంలో ఓ మోస్తరు వర్షం



సీతారామపురం: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా ఎండవేడిమి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. ఈ తరుణంలో వర్షం కురిసి వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ప్రజలు కాస్తా ఊరట చెందారు.

బుక్ బ్యాంక్ ప్రారంభం

సోమశిల(చేజర్ల): చేజర్ల మండలం ఏటూరు మెయిన్ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బుక్ బ్యాంక్‌ను ఎంఈఓ-2 డీసీ మస్తానయ్య శుక్రవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు డెయిరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రాజ్యలక్ష్మి, హెచ్‌ఎం ఆమంచర్ల సుబ్రహ్మణ్యం, ఏటూరు ఎస్సీ పాఠశాల ఉపాధ్యాయులు రమణ, ఈఓఆర్డీ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

